'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## విదేశీ విమర్శలు

**భారతదేశానికి** అతిపెద్ద ప్రజాస్వామిక దేశమని పేరుంది. అధిక జనాభా కలిగి ఉండటం, స్వాతంత్ర్య సిద్ధించిన నాటి నుంచీ ప్రజల ఓట్ల ద్వారానే ప్రభుత్వాలు ఏర్పడుతుండటమే ఇందుకు కారణం. ఒకప్పుడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి విపక్ష నేతలను జైల్లో పెట్టినప్పుడు ప్రపంచంలో భారతదేశం పరువుప్రతిష్ఠలు మసకబారాయి. తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఆమెను చిత్తుచిత్తుగా ఓడించి బుద్ధి చెప్పడం తెలిసిందే. జనతా పార్టీ పేరిట ప్రతిపక్షాలు చేసిన ప్రయోగం వికటించడంతో ఆమె మళ్లీ అధికారంలోకి రావడమనేది వేరే విషయం. ప్రస్తుతం మన దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతున్నదనే విమర్శలు అంతకంతకూ ఎక్కువగా వినవస్తున్నాయి. విపక్షాలను నయానా భయానా లొంగదీసుకునేందుకు కేంద్రంలోని బీజేపీ బాహాటంగానే ప్రయత్నిస్తున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ పలువురు విపక్ష నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలు అరెస్టు చేయడం ఈ సందర్భంగా గమనార్హం. తెలంగాణలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవితను అరెస్టు చేయడం, ముందుగా ఢిల్లీలో, ఆ తర్వాత పంజాబ్‌లో అధికారం చేపట్టి, ఇతర రాష్ట్రాలకూ విస్తరిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలను నిర్బంధించడంపై దేశంలో చాలామందికి అనుమానాలున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి పదవిలో ఉన్న అరవింద్ కేజ్రీవాల్‌ను లిక్కర్ స్కాంలో అరెస్టు చేయడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నది. ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చేసేందుకే ఆయనను జైల్లో పెట్టారని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంపై, పధాని నరేంద్ర మోదీపై ఘాటైన విమర్శలు చేసే నేతగా ఆయనకు పేరుంది. కేజ్రీవాల్ అరెస్టుపై అంతర్జాతీయంగా అభ్యంతరాలు వ్యక్తం కావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

జర్మనీ, అమెరికా దేశాలు భారత్‌లో జరుగుతున్న పరిణామాలపై విమర్శలు చేశాయి. చట్టబద్ధ పాలన ప్రాముఖ్యాన్ని, ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించాల్సిన అవసరాన్ని అవి మన దేశానికి నొక్కిచెప్పాయి. దౌత్య పరిభాషలో అవి ఉపయోగించిన పదాలు ఏవైనప్పటికీ మొత్తం మీద భారత్‌లో ఎన్నికలు సక్రమంగా జరగడం లేదనే అభిప్రాయాన్ని ఆ దేశాలు వ్యక్తం చేశాయి. దీనిపై మోదీ ప్రభుత్వం ఘాటుగా స్పందించింది. ఢిల్లీలోని జర్మనీ, అమెరికా దౌత్యవేత్తలను విదేశాంగ శాఖకు పిలిపించి మందలించింది. భారత్ అభ్యంతరాల తర్వాత జర్మనీ కొద్దిగా స్వరం తగ్గించినప్పటికీ అమెరికా మాత్రం విమర్శలను రెట్టించింది. తాజాగా ఐక్యరాజ్య సమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ ప్రతినిధి కూడా విమర్శలు చేయడం గమనార్హం. ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు సాధారణంగా ప్రభుత్వాలు చూసీచూడనట్టు వదిలేయవు. తమ 'అంతర్గత వ్యవహారాల'పై మాట్లాడే హక్కు వేరే దేశాలకు లేదని ఖండించడం సహజాతి సహజం. అయితే అంతర్జాతీయంగా వ్యక్తమవుతున్న విమర్శలు సబబు అన్న రీతిలో దేశ జనాభిప్రాయం కూడా ఉండటం ఆలోచించదగిన అంశం.

పశ్చిమ దేశాలు చేసే ఇలాంటి విమర్శలను ముఖవిలువతో తీసుకోలేము. అనేక విషయాల్లో అవి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తుంటాయి. ప్రజాస్వామ్య పరిరక్షకులం అంటూనే సైనిక నియంతలతో అంటకాగిన చరిత్ర వాటికుంది. బయటివారు చేసే విమర్శలను భారత్ దౌత్యపరంగా తిప్పికొట్టడం వరకు సబబే. కానీ స్వదేశీయులు చేసే విమర్శల మాటేమిటి? కేంద్ర ప్రభుత్వ సంస్థలు జరుపుతున్న దాడులు, అరెస్టులు, పెడుతున్న కేసుల విషయంలో, రాజ్యాంగ వ్యవస్థలపై సామాన్యులకు అనేక సందేహాలు కలుగుతున్నాయి. ప్రజాస్వామ్య ఉత్సవమైన ఎన్నికల వేళ విపక్ష నాయకులను, వారి పిల్లలను అరెస్టు చేయడమే ధ్యేయంగా, ప్రతిపక్షాలను బలహీనపరచడమే లక్ష్యంగా కదులుతుండటంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాల్సి ఉంది.

# రాజకీయ వ్యాపారంలో లాభమే లక్ష్యం



**బుద్దా మురళి**

'నా గుండె లబ్ డబ్ అని కొట్టుకోవడం లేదు. జగన్.. జగన్.. అని కొట్టుకుంటున్నది' అని ఏపీ శాసనసభలో గర్వంగా ప్రకటించిన వైఎస్ఆర్‌సీపీ శాసనసభ్యురాలు ఉండవల్లి శ్రీదేవి కొద్ది రోజులకే టీడీపీలో చేరిపోయారు. అంతటితో ఆగకుండా జగన్‌పై రోజూ దుమ్మెత్తిపోయడమే పనిగా పెట్టుకొన్నారు. రాజకీయాల్లో ఇదేం కొత్త కాదు. ఎన్టీఆర్ కాళ్లు మొక్కిన నాయకులే ఆయన కాళ్లను లాగేశారు. మోదీ ప్రధాని అయిన తర్వాత ఒకరిద్దరు శాసనసభ్యులు కాదు, ఏకంగా ప్రభుత్వాలే రాత్రికి రాత్రే మారిపోతున్నాయి. ఐదేండ్లకు ఓసారి ఎన్నికల్లో ప్రభుత్వాలు మారడం కాదు, మోదీ తలుచుకుంటే ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రభుత్వాలు మారిపోతున్నాయి. 'షిండేలను ప్రవేశపెడతాం జాగ్రత్త!' అని కొందరు నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేస్తుండటం పరిస్థితికి అద్దం పడుతున్నది.

రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక పార్టీ మార్పిడి నిరోధక చట్టాన్ని తీసుకువచ్చారు. పార్లమెంట్, అసెంబ్లీలు చట్టాలను రూపొందించే పవిత్ర ఆలయాలు. అటువంటి చట్టసభల్లో పార్టీ మార్పిడి నిరోధక చట్టం అమలు తీరు ఎంత గొప్పగా ఉందో మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. 'తాళం వేసితిని కానీ, గొళ్లెం పెట్టడం మరిచితిని'.. అన్నట్టుగా ఈ చట్టం హాస్యాస్పదంగా మారిపోయింది. ఒక శాసనసభ్యుడు లేదా పార్లమెంట్ సభ్యుడు పార్టీ మారినప్పుడు ఆ పార్టీ వాళ్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్. సహజంగా స్పీకర్ అధికార పక్షానికి చెందినవారే అయి ఉంటారు. స్పీకర్ స్వతంత్రంగా వ్యవహరిస్తారని ఆశించడం అత్యాశే అవుతుంది. న్యాయవ్యవస్థను ఆశ్రయించినా ఫలితం ఉండటం లేదు. స్పీకర్ అధికారాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోదు. గతంలో సుప్రీం కోర్టు వరకు వెళ్లిన దాఖలాలు ఉన్నాయి. సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సలహా ఇవ్వడం తప్ప సర్వోన్నత న్యాయస్థానం కూడా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ఏపీ, తెలంగాణలో గతంలో ఇలాంటి సందర్భాలు వచ్చినప్పుడు శాసనసభ చివరి దశలో ఎన్నికలకు వెళ్లే ముందు స్పీకర్లు నిర్ణయాలు తీసుకున్నారు. ఐదేండ్ల పదవీకాలం ముగిసే సమయంలో నిర్ణయం తీసుకుంటున్నారంటే.. చట్టాలు చేసే చట్టసభలే పార్టీ మార్పిడి నిరోధక చట్టాన్ని ఎంత బాగా అమలు చేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

> ఓటర్లు ప్రజాప్రతినిధులను పార్టీ పరంగా ఎన్నుకుంటారు. ప్రజలు తమకున్న ఓటు హక్కు ద్వారా ఒక పార్టీ అభ్యర్థిని ఎన్నుకున్నప్పుడు అతను మరో పార్టీలో చేరడమంటే ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా వెళ్లినట్టే. ఒక పార్టీ మినహాయింపు అని కాదు.. అన్ని రాష్ట్రాల్లో, అన్ని పార్టీల్లో ఇదే తంతు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచే ఈ సమస్యను ఎదుర్కొంది. వైఎస్ఆర్ హయాంలో 13 మంది టీఆర్ఎస్ శాసనసభ్యులను కాంగ్రెస్ తమవైపు తిప్పుకొంది. ఈ 13 మందిలో సంగారెడ్డికి చెందిన జగ్గారెడ్డి మినహా మిగిలిన వారెవరూ తిరిగి శాసనసభకు ఎన్నిక కాలేదు.

2014లో తెలంగాణ ఏర్పడి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలో పలువురు చేరారు. ఆంధ్రాలోనూ ఇదే జరిగింది. 2014లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 23 మంది శాసనసభ్యులను చంద్రబాబు టీడీపీలో చేర్చుకున్నారు. నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి అయితే కనీసం ఎంపీగా ప్రమాణస్వీకారం చేయకుండానే టీడీపీలో చేరిపోయారు. ఎంతమంది పార్టీని వీడినా వైఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి పట్టించుకోలేదు. 'జనం ఆదరణే నాకు ముఖ్యం, వాళ్లు పోతేపోనీ' అని అనుకున్న ఆయన వారిని ఖాతరు చేయలేదు. 2019 ఎన్నికల్లో జగన్ ఆశించినట్టే



ప్రజలు ఆ పార్టీని ఆదరించారు. 23 మంది శాసనసభ్యులను టీడీపీలో చేర్చుకున్న చంద్రబాబుకు ఆ ఎన్నికల్లో 23 సీట్లే వచ్చాయి. పార్టీలు మారడాన్ని అధినాయకులు ప్రోత్సహిస్తున్నా జనం మాత్రం సహించడం లేదు. ఎన్నికల్లో ఫిరాయింపుదారులను తిరస్కరిస్తున్నారు.

> రాజకీయం పక్తు వ్యాపారంగా మారిపోయింది. కొన్ని నియోజకవర్గాల్లో ఎంపీగా పోటీ చేయాలంటే వంద కోట్ల రూపాయలు అవసరం. తాము చేసిన ఖర్చును రాబట్టుకోవడంతో పాటు అదనంగా సంపాదించుకోవడం కోసం, తిరిగి గెలవడం కోసం అధికార పక్షాన్ని పలువురు నేతలు ఆశ్రయిస్తున్నారు.

గతంలో కన్నా ఈ సారి తెలంగాణలో చాలా వేగంగా గోడ దూకేస్తున్నారు. కె.కేశవరావును ప్రజలెప్పుడూ ఓటు వేసి ఎన్నుకోలేదు. టీఆర్ఎస్‌లో చేరిన తర్వాత ఆ పార్టీ అతనికి రెండు సార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చింది. ఆయన కుమార్తెను హైదరాబాద్ మేయర్‌ను చేసింది. అయితే బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. తండ్రి, కూతురు కాంగ్రెస్‌లో చేరిపోయారు. సాధారణంగా నాయకులు పార్టీ మారినప్పుడు.. తనకు పార్టీలో అన్యాయం జరిగిందని, అందుకే పార్టీ మారుతున్నానని ప్రకటిస్తారు. కేకేను రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా, ఆయన కుమార్తెను గ్రేటర్ హైదరాబాద్ మేయర్‌గా అవకాశం కల్పించాక కూడా అన్యాయం జరిగిందని అనడానికి కేకే మొహమాట పడ్డట్టున్నారు. అందుకే అన్యాయమనే డైలాగ్‌ను ఆయన వాడలేదేమో. దేశంలో కాంగ్రెస్ గడ్డు పరిస్థితుల్లో ఉందని, అందుకే ఆ పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. కనీసం పార్లమెంట్‌లో ప్రతిపక్ష హోదాకు అవసరమైన ఎంపీ స్థానాలను కూడా గెలవని కాంగ్రెస్ దశాబ్ద కాలంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. గడ్డు పరిస్థితి ఈ రోజు కొత్తగా వచ్చింది కాదు. కేశవరావు కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీని గట్టెక్కించే అవకాశమూ లేదు. దేశంలో ఎక్కడా కాంగ్రెస్ గెలుస్తుందనే గ్యారెంటీ లేదు. స్వయంగా సోనియాగాంధీ ప్రత్యక్ష ఎన్నికలకు దూరమైపోయారు. ఇటీవల ఆమె రాజ్యసభకు ఎన్నికైన విషయం విదితమే.

కేశవరావు, కడియం శ్రీహరి లాంటి వారి విషయంలో పార్టీ మారడం వెనుక వారి పిల్లల ఒత్తిడి ఉన్నట్టు వినిపిస్తున్నది. మేయర్‌గా ఉన్న తన కుమార్తె కోసం ఆయన తన రాజకీయ జీవితం చివరి దశలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కడియం శ్రీహరి కూడా తన కుమార్తె కావ్య కోసం కాంగ్రెస్‌లో చేరారు. 'పుట్టి నాలుగు రోజులు కాలేదు, నా జీవితంలో ఇంత పెద్ద గాలివాన చూడలేదు' అని సామెత చెప్పినట్టు.. బీఆర్ఎస్‌కు అవినీతి మరక అంటిందని, అందుకే రాజీనామా చేస్తున్నానని కడియం కావ్య చెప్పడం విడ్డూరం. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా కావ్య పేరును ఆ పార్టీ ప్రకటించిన మూడు నాలుగు రోజులకే ఆమె పార్టీ మారాలనే నిర్ణయం తీసుకున్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాలని పార్టీ అడిగినప్పుడే.. 'వద్దేవద్దు, మీ పార్టీకి అవినీతి మరక అంటింది' అని చెబితే బాగుండేది కదా. పాపం! అవినీతి అంటే ఆమెకు ఎలర్జీ అనుకుంటా. అవినీతి అంటే ఎలర్జీ ఉన్న ఆమె పవిత్రమైన కాంగ్రెస్‌లో చేరారు. 135 ఏండ్లలో పవిత్రమైన కాంగ్రెస్ చేసిన అవినీతి గురించి తన తండ్రిని కడియం కావ్య అడగాల్సింది. 'మాజీ లెక్చరర్ గారు' కాంగ్రెస్ అవినీతి గురించి అరటి పండు ఒలిచి పెట్టినంత బాగా వివరించేవారు. కాంగ్రెస్ అవినీతిపై అద్భుతంగా దశాబ్దాల పాటు మాట్లాడిన కొద్దిమంది తెలంగాణ నాయకుల్లో కడియం శ్రీహరి ఒకరు. ఐదేండ్ల క్రితమే వరంగల్ పార్లమెంట్ సీటు కోసం కడియం కావ్య తీవ్రంగా ప్రయత్నించారు. అప్పుడామెకు టికెట్ దక్కలేదు. ఇప్పుడు కాంగ్రెస్‌లో అయితే లాభసాటి బేరం అనుకోని ఆ పార్టీలో చేరారు. కడియం శ్రీహరి ముక్కుసూటి మనిషి. పార్టీలు మారడం అయన తత్త్వం కాదు. గతంలో ఒక ఛానల్ వాళ్లు అడిగితే.. 'ఉప ముఖ్యమంత్రి పదవి వరకు వెళ్లాను. ముఖ్యమంత్రి కావాలనే కోరికేమీ లేదు. ఇక నేను పార్టీ ఎందుకు మారుతాను. మారాల్సిన అవసరం ఏముంది?' అని ఎదురు ప్రశ్నించారాయన. అందుకే కుమార్తె ఒత్తిడి వల్ల పార్టీ మారినట్టు తెలుస్తున్నది. పార్టీ మారినవారు చెబుతున్నట్టు బీఆర్ఎస్‌లో లోపాలు ఉండవచ్చు. అయితే ఆ లోపాలు పార్టీ ఓడిపోయి, వీళ్లు పార్టీ మారాలని అనుకున్నప్పుడే గుర్తుకు వచ్చాయా? అనేదే సమస్య.

చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు రంజిత్‌రెడ్డి తాను మళ్లీ పోటీ చేయడం లేదని తొలుత ప్రకటించారు. తర్వాత కాంగ్రెస్‌లో చేరి అదే చేవెళ్ల నుంచి ఆ పార్టీ తరపున బరిలో దిగుతున్నారు. 'బీఆర్ఎస్ ఎంపీగా ఏమీ చేయలేక విఫలమయ్యాను. ఈ సారి కాంగ్రెస్ ఎంపీగా అవకాశం ఇవ్వండి. ఎంతో చేసి చూపిస్తాను' అని ఆయన ప్రచారం చేస్తారేమో చూడాలి.

రాజకీయం వ్యాపారంగా మారిపోయిన ప్రస్తుత తరుణంలో కోట్ల రూపాయలు ఖర్చు చేయగలిగినవారే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. టికెట్లు వారికే వస్తున్నాయి. క్యారెక్టర్ చూసి టికెట్ ఇస్తే, వారి వద్ద డబ్బులు ఉండవు. గెలిచే అవకాశాలు సన్నగిల్లుతాయి. పార్టీలు కూడా చూసేది సంపన్నులనే. అలాంటివారు గెలిచాక లాభసాటి నిర్ణయాలే తీసుకుంటారు. బీఆర్ఎస్ నుంచి లాయల్టీ రాత్రికి రాత్రి కాంగ్రెస్‌కు మారినపుడు.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ లాయల్టీ కాంగ్రెస్ నుంచి బీజేపీకి మారదనే గ్యారెంటీ ఏమీ లేదు.

> రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి కాంగ్రెస్ ద్వారాలు తెరిచినట్టే.. ఒకవేళ బీజేపీ మూడోసారి గెలిస్తే పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీ ద్వారాలు తెరిచే అవకాశం లేకపోలేదు. సార్వత్రిక ఎన్నికల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని బీజేపీ శాసనసభ్యులు విలేకరుల సమావేశాల్లోనే హెచ్చరిస్తున్నారు. 119 నియోజకవర్గాలు ఉన్న తెలంగాణలో బీజేపీ శాసనసభ్యుల సంఖ్య 8 మాత్రమే. మరి ప్రభుత్వం ఉండదని వారెలా చెబుతారని సందేహం కలగవచ్చు. కానీ, ఆ పార్టీ ఏమైనా చేయగలదు. అందుకే బీజేపీ నేతల మాటలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఎందుకంటే కమలం సంగతి కాంగ్రెస్‌కు తెలుసు. పొరుగునున్న మహారాష్ట్రలో ఏం జరిగిందో కాంగ్రెస్ కూడా చూసింది.

వందల కోట్లు ఖర్చు చేసి గెలిచేవాళ్లు నిజాయితీగా ఉండాలని కోరుకోవడం అత్యాశే అవుతుంది. నిజాయితీగా ఉంటారని అనుకోవడం అమాయకత్వమే అవుతుంది. రాజకీయాల్లో మితిమీరిన వ్యయం రాజకీయాలను వ్యాపారంగా మార్చేసింది. ప్రజాస్వామ్యం అంటే సంపన్నుల రాజకీయ వ్యాపారం అన్నట్టుగా తయారైంది. ప్రస్తుత రాజకీయాల్లో సిద్ధాంతాలు, లక్ష్యాలంటూ ఏమీ లేవు. ఏ పార్టీలో చేరితే ఎంత లాభం అనేదే ముఖ్యం. పోలింగ్ రోజు క్యూలో నిలబడి ఓటు వేయడం వరకే ప్రజల బాధ్యత. గెలిచిన వారిని ఎవరు కొంటారు? ఎవరికి, ఎవరు అమ్ముడుపోతారనేది ప్రజలకు సంబంధం లేని వ్యవహారం. ప్రజాస్వామ్యం క్రమంగా ప్రజలకు సంబంధం లేని అంశంగా మారిపోతున్నది. అయితే పార్టీలు మారినవారిని ప్రజలు ఆదరిస్తారా? తిరస్కరిస్తారా? అనేది ఎన్నికల్లో తెలుతుంది. ■

అది మార్చి 30. ఉదయం 8 గంటలు. ఉమ్మడి ఏలుబడిలో ఎగువ మానేరు పరిరక్షణ కోసం పోరాటం చేసిన వారిలో ఒకరైన గూడూరు చీటీ వెంకటనర్సింగారావు, నేను మేడిగడ్డ చూసేందుకు బయలుదేరాం. అల్వాల్ టు లక్ష్మి బ్యారేజ్. 270 కిలోమీటర్ల దూరం. 5 గంటల ప్రయాణం. మిట్ట మధ్యాహ్నం ఒంటి గంటకు అక్కడికి చేరుకున్నాం. ఎంతో ప్రయాసపడి అక్కడికి వెళ్తే గేటు మూసి ఉంది. గార్డును రిక్వెస్ట్ చేశాం. లోపలికి వెళ్లేందుకు అనుమతి లేదని చెప్తూనే ఆంక్షల బోర్డు చూపించాడు. రక్షణ బలగాలది అదే మాట. ఎల్అండ్‌టీ వారూ అంతే. అందరి చుట్టూ చక్కర్లు కొట్టాం. అయినా ప్రయోజనం లేదు. అంతా నిశ్శబ్దం. నిర్మానుష్యం. స్తబ్ధత. భారీ యంత్రాల విశ్రాంతి. మూడు రాష్ట్రాల సీఎంల యాగశాల షెడ్డు కింద టూ వీలర్లు ఉన్నాయి. సంద్రంలోకి పోయే నీరు పోగా, మధ్యలో పాయల్లా జలాలు. తేలిన ఇసుక తెన్నులు. లక్షల ఎకరాలకు నీళ్లందించిన కాళేశ్వరం ప్రాజెక్టును అలా చూసి తల్లడిల్లిపోయాం.

# కాళేశ్వరమే క్యాంప్ ఆఫీస్ కాకపోవునా!



**దుర్గాప్రసాద్ ఇల్లెందుల**
94408 50384



ప్రాజెక్టును చూసేందుకు అనుమతించకపోవడంతో మేడిగడ్డ (అంబట్‌పల్లి) నుంచి గోదావరి-ప్రాణహిత సంగమానికి చేరుకున్నాం. మధ్యాహ్నం 2.30 గంటల వరకు పరిసరాల్లో తిరిగాం. బోసిపోయిన ఆ ప్రాంతం మదిలో రిజిస్టరై.. తిరుగు ప్రయాణంలో మదిని తొలుస్తున్నది. కేసీఆరే సీఎంగా ఉంటే ఇప్పుడు ఏం చేసేవారనే ప్రశ్న నా మదిని తొలుస్తున్నది. ప్రశ్నతో పాటే సమాధానాలు తన్నుకొస్తున్నాయి. ఆయనే గనుక సీఎంగా ఉండి ఉంటే.. మేడిగడ్డ బ్యారేజ్‌కున్న 85 పిల్లర్లలో పగుళ్లు వచ్చిన 19, 20, 21 పిల్లర్లను రిపేరు చేయించేందుకు అక్కడే మకాం వేసేవారు. తెలంగాణ తేవడం ఆయనకు ఎంత అత్యవసరమో, కాళేశ్వరం ప్రాజెక్టును పరిపూర్ణం చేయడం, పరిరక్షించడం కూడా అంతే. కాబట్టి, సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తదుపరి ఆయనకు అదే పని చేసేవారు. ఆ మూడు పిల్లర్లు చక్కదిద్ది, రైతుకు పంటల సద్ది కట్టే దాకా మేడిగడ్డే సీఎం క్యాంపు ఆఫీసు అయ్యేది. కాఫర్ డ్యాం కట్టించి, నీళ్లను ఎత్తిపోయించి, పొలాలు పారించేవారు. మేడిగడ్డను రిపేర్ చేయించే విషయమై.. జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సేవలు అందిపుచ్చుకునేవారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎవరినైనా యుద్ధ ప్రాతిపదికన మోహరించేవారు. కరువుఛాయలే లేకుండా ఈపాటికి అంతా సజావుగా ఉండేది. వచ్చే వర్షాకాలానికల్లా మేడిగడ్డ బ్యారేజ్ సురక్షితంగా ఉండేది.

ఇప్పుడున్న ప్రభుత్వం ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాత కేసీఆర్ సహకారం తీసుకుంటే రాజకీయాలకే రోల్‌మోడల్ అయ్యేది. కానీ, ఇక్కడ ఉన్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కానీ నియంత్రణ మాత్రం ఢిల్లీది. అందుకే రాజకీయ లాభనష్టాల బేరీజులో కాళేశ్వరం నలుగుతోందా? ఆ ప్రభావం వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై పడుతోందా? అనే సందేహాలు కలుగుతున్నాయి.

పోయిన ప్రాణాన్ని తెచ్చివ్వడం ఎవరి తరమూ కాదు. అలాగే కరువు వల్ల ఏర్పడిన కష్టనష్టాలూ పూడ్చలేనివే. తరతరాలు కరువు కాటకాలతో తల్లడిల్లిన ప్రాంతం మన తెలంగాణ. సుమారు ఎనిమిదేండ్లుగా లేనిది అకస్మాత్తుగా ఎవరు తెచ్చిన కరువు ఇది? కాలమా? మనుషుల మస్తిష్కమా? ఈ క్రమంలో ఎట్లెట్ల బతుకు తెరువు అనే రంది మళ్లీ మొదలైంది. కాళేశ్వరం ప్రాజెక్టుల అంశంపై భిన్న వాదనలు బోలెడు. సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లూ ఏకాభిప్రాయంతో లేరు. ఎవరి లైన్ వారిదే. అంకెలు, లెక్కలు, ఆకృతులూ అంతే. అంతిమంగా గోస మాత్రం సేద్యానికే, ప్రజలకే.

తెలంగాణలో చాన్నాళ్లకు కరువు వచ్చింది. ఇప్పటికే 10-14 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయింది. ఇపుడే ఇట్ల ఉంటే, వచ్చే సీజన్‌లో పుసుక్కున కాలం కాకుంటే ఎట్లా? ఎవరు తెచ్చిన కరువో, కారకులు ఎవరో కాని వివాదం మాత్రం కాళేశ్వరం ప్రాజెక్టులో కేంద్రీకృతమైంది.

> తరాల కరువు కాలగర్భంలో కలిసే ఉపాయమైంది కాళేశ్వరం. ఇప్పుడదే అపాయంగా కాంగ్రెస్ సర్కారుకు తోచింది. నిరుడు ఈ టైంకు ఎటు చూసినా నీరు. కనుచూపునకు మించి పచ్చని పొలాలు. అలాంటిది ఎద్దడి దుఃఖపెడుతూ ఒత్తిడి పెంచుతోంది. చాన్నాళ్లకు మళ్లా బోరు ఉనికిలోకి వచ్చింది.

ప్రాజెక్టులకు ఇబ్బందులు తలెత్తడం చరిత్రలో కొత్త కాదు. ఏపీలో పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. కడెం డ్యాం కొట్టుకుపోయింది. దేవాదుల పైపులు, గూడెం లిఫ్టు పగిలాయ్. దేవాదుల ఫేజ్ త్రీ టన్నెల్ డ్యామేజ్ అయింది. మూసీ గేట్లు కొట్టుకుపోయినయి. సింగూరు డ్యాం గేట్లూ కొట్టుకుపోయినయి. పాలెం వాగు ప్రాజెక్టు మట్టికట్ట రెండు సార్లు తెగింది. చెప్పుకొంటూ పోతే ఇలాంటివి ఎన్నో ఉన్నాయి.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లెక్కల ప్రకారమే కాళేశ్వరం వ్యయం రూ.93 వేల కోట్లు. 93 వేల ఎకరాల ఆయకట్టు. కానీ, 17 లక్షల ఎకరాల స్థిరీకరణ జరుగలేదా? ఎస్సారెస్పీ స్టేజ్-1, స్టేజ్-2, ఎల్ఎండీ, నిజాంసాగర్, అప్పర్ మానేరు వంటి అనేక ప్రాజెక్టుల కింద చెరువులు నిండాయి.

> శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 1960 దశకంలో మొదలైంది. 65 వేల ఎకరాలకు నీళ్లిచ్చేందుకు 17 ఏండ్లు పట్టింది. ఏ ప్రాజెక్టుకైనా నిలదొక్కుకోవడానికి 10-15 సంవత్సరాలు పడుతుంది. కానీ కాళేశ్వరం మాత్రం రికార్డుస్థాయిలో తక్కువ సమయంలో అందుబాటులోకి వచ్చింది. మన తెలంగాణకు గోదావరే పెద్ద దిక్కు. ఆ జలాల్లో 966 టీఎంసీల నీటి వాటా సమర్థవంతంగా వాడుకునే ప్రణాళిక గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉండింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీ- డిజైన్ చేసి, 240 టీఎంసీల నీటి వినియోగం కోసం కాళేశ్వరం ప్రాజెక్టులకు కేసీఆర్ సర్కార్ బీజం వేసింది.

అయితే కేసీఆర్ సర్కార్ అందించిన ఫలాలను కాంగ్రెస్ పాలకులు అందుకోవడం లేదు. తెలంగాణలో ప్రభుత్వం మారాక అన్నారం బ్యారేజీ నుంచి గోదావరి నీటిని టీఎంసీల కొద్దీ వదిలేశారనే చర్చ ఉంది. ఆ విధంగా సముద్రం పాలు చేయకుండా, కాఫర్ డ్యాం కవచంగా చెరువులకు నీళ్లను మళ్లించి ఉంటే ఇంత అనర్థం జరిగేదా? మేడిగడ్డ వద్ద ఒక్కోసారి 20 లక్షల క్యూసెక్కుల వరద ఉంటుంది. జూన్‌లోగా రిపేర్ చేయకుంటే పూర్తి బ్యారేజీకి ప్రమాదం. అంతిమంగా సస్యశ్యామల తెలంగాణ రాష్ట్రమే ఏ పార్టీ ప్రభుత్వానికైనా ధ్యేయం కావాలి. తెలంగాణకు మంచి జరుగుతుందనే అంతటి కాళేశ్వరం ప్రాజెక్టును తలపెట్టారు కేసీఆర్. ఫలితాలు చూపెట్టారు. ఈ అంశంలో చెడ్డ పేరు తెచ్చుకోవాలని కేసీఆర్‌కు ఉంటుందా? ఎవరైనా క్షణకాలం నిదానంగా ఆలోచించాలి. ■

# ఉచితాల వలలో చిక్కొద్దు



**కన్నోజు మనోహరాచారి**
79950 89083

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఉచితాల ప్రచారం జోరందుకున్నది. నాయకుల్లో అధికార దాహం ఎక్కువైపోయింది. గంటల్లోనే పార్టీలు మారిపోవడం, క్షణాల్లోనే నాలుకలు మడతపెట్టి నిన్నటి వరకు తానున్న పార్టీని తిట్టడం షరా మామూలైపోయింది. తమను ఎన్నుకున్న ప్రజల అభిప్రాయాలకు నాయకులు కనీసం విలువ ఇవ్వడం లేదు. ఉచితాలను ఎరగా వేసి సులువుగా అధికారంలోకి రావచ్చని పార్టీలు, అభ్యర్థులు భావిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణం.

కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీతో ఆ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోనూ అదే వ్యూహాన్ని అనుసరించింది. ఆరు గ్యారెంటీల పేరిట ఉచితాల వల విసిరి అధికారంలోకి వచ్చింది. అయితే ఇప్పుడు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

> ఆరు గ్యారెంటీల్లో భాగంగా పలు హామీలను ప్రకటించిన కాంగ్రెస్ వాటి అమలుకు నిధులను ఎలా సమకూర్చుకుంటుందో తెలియడం లేదు. వాటి అమలు సంగతి అటుంచితే వాటి వల్ల రాష్ట్ర ఖజానాపై అదనపు భారం పడుతుందనేది అక్షర సత్యం. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పలు పార్టీలు ఉచితాలను ప్రకటిస్తూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ముందుకొస్తున్నాయి. ఉచితాల మాయలో పడి మనం ఓట్లు వేసి గెలిపించిన ప్రభుత్వాలే.. గద్దెనెక్కాక ఆ భారాన్ని మనపై వేస్తున్నాయనే విషయాన్ని ప్రజలు మరువవద్దు.

అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. దాన్ని సాకుగా చూపి సంక్షేమం పేరిట ఉచితాలు ప్రకటించడం సరికాదు. ప్రజలకు ఉచితాలే సరిపోతాయా? సాగు, తాగునీటి ప్రాజక్టులు, పరిశ్రమలు, ఉపాధి, రహదారులు, దవాఖానలు, పాఠశాలలు, కళాశాలలు, మౌలిక వసతుల అవసరం లేదా?

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే శాశ్వత పథకాలను అమలు చేసినప్పుడే వారి జీవితాలు మారుతాయి. అదే సమ యంలో ఉచితాలను చూసి ఓట్లు వేసే విధానానికి ప్రజలు స్వస్తి పలకాలి. శాశ్వత అభివృద్ధి కోసం పాటు పడే నాయకులను ఎన్నుకోవాలి. ■

